క్లుప్తంగా

రూపెనగుంట్ల సర్పంచ్‌గా తెలగొర్ల వెంకట్రావు



నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్ల గ్రామసర్పంచ్‌గా తెలగొర్ల వెంకట్రావు సోమవారం ప్రమాణస్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు గ్రామసర్పంచ్‌గా పనిచేస్తున్న గోగా ఆదిలక్ష్మి అనారోగ్యంతో సెలవుపెట్టడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న వెంకట్రావు సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నూతన సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తెలగొర్ల వెంకట్రావు మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు, గ్రామాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి అబ్దుల్లా, ఎంపీటీసీ సభ్యుడు మందా దానియేలు, బీసీ విభాగం అధ్యక్షుడు కోనంకి ఆదినారాయణ, పార్టీనాయకులు పాల్గొన్నారు.

సేవావజ్రకు సందెపోగు లింకన్ ఎంపిక



అచ్చంపేట: ప్రభుత్వం విశిష్ట సేవలు అందించిన వలంటీర్లకు ఇచ్చే సేవవజ్ర అవార్డుకు అచ్చంపేట సచివాలయం-1కు చెందిన సందెపోగు లింకన్ ఎంపికయ్యారు. సేవా రత్న అవార్డులకు అచ్చంపేట సచివాలయం-2కు చెందిన డేగెల శ్రీనివాసరావు, యేలూరి శ్రీనివాసరావు, కస్తలకు చెందిన షేక్ జానీబాషా, కొత్తపల్లికి చెందిన సింగారెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కొండూరుకు చెందిన పోలూరి కుమారి తదితర వలంటీర్లు ఎంపికయ్యారు.

25న జాబ్‌మేళా

నకరికల్లు: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ గుంటూరు ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీస్ ఫార్మా కంపెనీలో టెక్నికల్ ట్రైనీలుగా పనిచేసేందుకు ఇంటర్మీడియట్ 55శాతం మార్కులతో ఉత్తీర్ణులైన యువతీ యువకులను ఈనెల 25న జాబ్‌మేళాకు ఆహ్వానిస్తున్నట్లు మండల జాబ్స్ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరంలో ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై 17-20ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. హైదరాబాద్‌లో పనిచేసేందుకు 100ఖాళీలు ఉన్నాయని వేతనం నెలకు రూ.11వేలు ఉంటుందన్నారు. ఎంపికైన వారికి ఉద్యోగ అవకాశంతో పాటు బీఎస్సీ, డిగ్రీ ఫార్మాస్యూటికల్ కోర్సులను ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్శిటీలో ఉచితంగా చదివిస్తారన్నారు. ఈనెల 25న నిర్వహించే జాబ్‌మేళాకు పేర్లునమోదు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఏటీ అగ్రహారం, 19వ లైను, శ్రీపోలేరమ్మతల్లి కల్యాణమండపం, గుంటూరు చిరునామాకు రావాలన్నారు. వివరాలకు 9908482907 నంబరును సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలో 11 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్ కారణంగా సత్తెనపల్లి టౌన్‌లో ఈ నెల 23న ఉదయం 6 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సత్తెనపల్లి టౌన్ ఏఈ పి.రవికిరణ్ సోమవారం తెలిపారు. రైల్వే స్టేషన్ ఏరియా, సుగాలీ కాలని, మీ సేవ ఏరియా, వావిలాల పార్క్ ఏరియా, పాల వెంకాయమ్మ బజార్, వడ్డెర బజార్, పోలీస్ స్టేషన్ ఏరియా, సబ్ జైల్ ఏరియా, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, డీఎస్పీ ఆఫీసు వెనుక బజార్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏరియా ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.ఆ ప్రాంత విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించగలరని కోరారు. ఏదైనా విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 9494116238 కు ఫోన్ చేయాలన్నారు.

పిడుగురాళ్లలో గ్రంథాలయ నిర్మాణానికి కృషి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో గ్రంథాలయ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును కలిసి పట్టణంలో గ్రంథాలయ నిర్మాణానికి కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కోటా సాయికుమార్, పలువురు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో 10 సెంట్ల స్థలం కేటాయించారని, అది త్వరలోనే నిర్మితమయ్యేలా కృషి చేస్తామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, ఎస్ఎఫ్ఐ నవిత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

- పూర్తయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తాను
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిన అన్ని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులన్నింటికీ ఆయా శాఖల ద్వారా బిల్లులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ షేక్ జమీలా గౌరవఅతిథిగా పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ మండలంలో ఏదైనా సమస్యలుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా అధికారులను ఆదేశించటం జరిగుతుందన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలున్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యాక్రమాలు చేపట్టారన్నారు. లక్ష్యాలు చేరుకునే విధంగా వైద్యులు, వైద్యసిబ్బంది పనిచేయాలన్నారు. తరచూ ఆసుపత్రులను తనిఖీ చేస్తానని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తప్పక చర్యలుంటాయన్నారు.

టీబీ రోగులకు నిక్షయమిత్ర పౌష్టికాహార కిట్లు..

టీబీ రోగులకు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందజేయాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటుచేసిన నిక్షయమిత్ర పౌష్టికాహార కిట్లను ఎమ్మెల్యే తన సొంత ఖర్చుతో ఒక్కో కిట్టు రూ.700 చొప్పున ఆరునెలల పాటు అందించే విధంగా 51 మందికి అందచేయటం జరిగింది. అనంతరం పలుశాఖల అధికారులు వారి వారి శాఖల ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను తెలియపరిచారు. ఉద్యానశాఖ అధికారి సీహెచ్ జననీని మిర్చి విత్తనాలు సకాలంలో అందించే విధంగా చూడాలని, అవసరమైన ముందుగా ఆర్బీకేల్లో డీడీలు తీస్తామని కొందరు ప్రజాప్రతినిధులు కోరారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఎఫ్ ఎంఈ పథకం ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ తయారీ యూనిట్లు పెట్టుకునే వారికి బ్యాంకుల నుంచి 35 శాతం సబ్సిడీ 90 శాతం రుణం దొరుకుతుందన్నారు. లోఓల్టేజీ సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు త్వరలో పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ డి.శ్రీనివాసరవు, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీటీసీ షేక్ జమీలా, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, పీహెచ్‌సీ వైదురాలు డాక్టర్ బాలఅంకమ్మబాయి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

ధూళ్లిపాళ్లలో ఫ్యామిలీ ఫిజీషియన్



ధూళ్లిపాళ్లలో ఇంటి వద్ద వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

సత్తెనపల్లి: మండలంలోని ధూళ్ళిపాళ్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో సోమవారం పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ అనూష వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 145 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ ఓపీ 24 మంది, హైపర్ టెన్షన్ 26 మంది, డయాబెటిస్ 32 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 40 మంది, గర్భిణులు 10 మంది, బాలింతలు ఐదుగురు, చిన్నారులు 8 మంది ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎ.వరలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ జి.సునీత, ఏఎన్ఎం ఎం.నవీన, హెల్త్ అసిస్టెంట్ పెండెం నటరాజ్, డీఈఓ ఇజ్రాయిల్, ఆశా కార్యకర్తలు మరియమ్మ, సుబ్బాయమ్మ, అరుణ, తదితరులు ఉన్నారు.

పలుదేవర్లపాడులో...

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో వైద్యురాలు డి.నవ్య పాల్గొని 105 మందికి వైద్యసేవలందించారు. బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. మంచంపై ఉన్న రోగుల వద్దకు వెళ్లి వారికి వైద్యసేవలతో పాటుగా మందులను అందించారు. గర్భిణులకు, బాలింతలకు వ్యాక్సిన్ అందించారు. డీఈఓ రవితేజ, సీహెచ్ఓ మధుబాబు, ఎంపీహెచ్ఏ మస్తాన్‌రావు, ఏఎన్ఎం రుక్మిణి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపాలదిన్నెపాలెంలో...

సత్తెనపల్లి: మండలంలోని దీపాలదిన్నెపాలెం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో సోమవారం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.ప్రదీప్ వివిధ రుగ్మతలతో బాధపడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 107 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ ఓపీ 62 మంది, హైపర్ టెన్షన్ 16 మంది, డయాబెటిస్ 21 మంది, గర్భిణులు ఏడుగురు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రెటరీ పి.చైతన్య, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్, ఎంఎల్‌హెచ్‌పీ కె.మాధురి, ఏఎన్ఎం పి.లక్ష్మీకుమారి, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, డీఈఓ సుధాకర్, ఆశా కార్యకర్త సునీత, తదితరులు ఉన్నారు.

రెండురోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు

- గత శుక్రవారం రాత్రి వచ్చిన ఉరుములు, మెరుపులకు పాడైన కంప్యూటర్లు
- దీనికి తోడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



క్రోసూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

క్రోసూరు: క్రోసూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పనులు గత రెండు రోజులుగా నిలిచిపోయాయని కార్యాలయ సబ్‌రిజిస్ట్రార్ భాస్కరరావు సోమవారం తెలిపారు. గత శుక్రవారం రాత్రి వచ్చిన ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలకు కార్యాలయంలో కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, మదర్‌బోర్డులు కాలిపోయినట్లు తెలిపారు. దీంతో రిజిస్ట్రేషన్ పనులు నిలిచిపోయాయన్నారు. అంతేకాక స్తంభాలు పడిపోవటంతో విద్యుత్ సరఫరాకు పూర్తిగా అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా కార్యాలయానికి తెలియచేశామన్నారు. టెక్నీషియన్లు మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. రెండు రోజుల్లో పనులు పునఃప్రారంభమవుతాయన్నారు.

కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్‌గా రమణారెడ్డి



సత్తెనపల్లి: పట్టణంలోని కెనరా బ్యాంక్ సత్తెనపల్లి శాఖ సీనియర్ మేనేజర్‌గా కమిరెడ్డి రమణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ఆర్ఓ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన పి.బ్రహ్మరాజు వైజాగ్‌కు బదిలీ అయ్యారు. అలాగే ఇక్కడ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్లుగా పని చేస్తున్న అనురాధ, విప్లవ్‌లు గుంటూరుకు, రాజేశ్వరి నరసరావుపేటకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో బాపట్ల నుంచి బండి రాజ్యలక్ష్మి, గుంటూరు నుంచి బెజవాడ జయరావు, చిలకలూరిపేట నుంచి అఖిలేష్‌లు రానున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ మేనేజర్ రమణారెడ్డిని గోల్డ్ అప్రైజర్ దేవరశెట్టి రవికుమార్, బ్యాంక్ ఉద్యోగులు పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆదర్శ కార్మికోద్యమ నేత సత్యనారాయణ

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య



పర్స సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య

సత్తెనపల్లి: ఆదర్శ కార్మికోద్యమ నేత కామ్రేడ్ పర్స సత్యనారాయణ అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన పర్స సత్యనారాయణ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సత్యనారాయణ కార్మిక వర్గ హక్కుల కోసం నిరంతరం శ్రమించిన ఆదర్శమూర్తి అని, ఆయన జీవితం కార్మిక వర్గానికి ఆదర్శమన్నారు. సింగరేణి కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు చేయడంలో పర్స సత్యనారాయణ పాత్ర కీలకమన్నారు. శాసన సభ్యుడిగా కార్మిక, కర్షక, పేద వర్గాల హక్కుల కోసం గళమెత్తారన్నారు. ఈ క్రమంలో అనేక నిర్బంధాలు ఎదుర్కొని రాష్ట్రంలో కార్మిక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో పర్సా సత్యనారాయణ పాత్ర మరువ రానిదన్నారు. తొలుత పర్స సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఆంజనేయ నాయక్, ఏపూరి గోపాలరావు, తదితరులు ఉన్నారు.

24న ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో ఈ నెల 24న కళ్యాణ వేంటేశ్వరస్వామి నూతన ఆలయ ప్రతిష్టామహోత్సవం జరుగుతుందని గ్రామస్తులు సోమవారం తెలిపారు. శ్రీశ్రీశ్రీకృష్ణయతీంద్ర మహాదేశికజీయర్‌స్వామి వారి ఆశీస్సులతో ఉదయం గం.8.55ని.లకు స్వామి వార్ల ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందన్నారు. ఆలయ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కంకణధారణ, శుద్ధి, నూతనవిగ్రహాలకు జలాధివాసం, నీరాజనం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందజేయాలి

నకరికల్లు: ప్రభుత్వపథకాలు అర్హులకు చేరవేయడంలో, ప్రజాసమస్యలు పరిష్కారంలో అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పలుశాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖలవారీగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు వివరించారు. పథకాలు అర్హులకు చేరవేయడంలో తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఈఓపీఆర్డీ గిరిధర్, డాక్టర్ బి.నాగమణి, ఆయాగ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



మునగోడు ముస్లింకాలనీలో సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మండల పరిధిలోని మునగోడు ముస్లింకాలనీలో సోమవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నుంచి సుమారు రూ.15లక్షలు ఈ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి కేటాయించామన్నారు. వీలైనంత త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. అదేవిధంగా మునగోడు గ్రామంలో జీజీఎంపీ నిధులు రూ.20లక్షలతో నిర్మాణం చేస్తున్న సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, గ్రామ సర్పంచి బంకా విష్ణు, సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిలకా సాంబయ్య, సైదారెడ్డి, సలావుద్దీన్, బంకా బాబు, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం



రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

దాచేపల్లి: నగర పంచాయతీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య అన్నారు. నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి నడికుడి వార్డు సచివాలయం వరకు రూ3.50కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. రెండో విడత పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బమ్మ సాంబయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో నగర పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. నారాయణపురం -నడికుడి రోడ్డు విస్తరణ ద్వారా ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, ఈ పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పట్టణ ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న దాచేపల్లి కొట్ల బజార్‌లో రూ.3కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, దీంతో పట్టణ ప్రజలు రాకపోకలకు ఇబ్బందిలేకుండా ఉందన్నారు. దాచేపల్లికి ప్రమాదకరంగా ఉన్న కాటేరువాగు ఆధునికీకరణ చేయడం ద్వారా పట్టణ ప్రజలకు వరద బెడద తప్పిందని చైర్మన్ గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేసి రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా నిలబెడతామని, పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గుర్తించాలని కోరారు. పట్టణ ప్రజలకు ఇంటింటికి తాగునీరు అందించే పనులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు నాగుబండి గురువులు, వందనపు వెంకట్రామయ్య, షేక్ షరీఫ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు మండ్లేం రామారావు, బుగ్గల జానీ, నాయకులు తదితరులు న్నారు.

వేంకటేశ్వర ఆలయ విగ్రహ పోస్టర్ల ఆవిష్కరణ



నూతన విగ్రహాల ప్రతిష్ట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జూన్ మొదటి వారంలో ప్రతిష్ఠించనున్న శ్రీ సుదర్శన నరసింహమూర్తి, రాజ్యలక్ష్మి, వీరాంజేయ స్వామి, జయ విజయుల ద్వారపాలకుల నూతన శిలా విగ్రహ పోస్టర్లను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు వారి వారి కార్యాలయాలలో సోమవారం ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయటం ఎంతో అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలందిస్తానన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావు సీఎంఆర్, నట్టువ రాధాకృష్ణ, గట్ల కోటిరెడ్డి, రవి, ఎంఈఓ వేముల నాగయ్య, పిల్లి కొండలు, చందూ గౌడ్ తదితరులున్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయండి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



పోలేపల్లి సర్పంచి శ్రీనివాసరెడ్డిని అభినందిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలను అందిపుచ్చుకొని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పోలేపల్లి గ్రామ సర్పంచ్ దేశం శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పిఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, పేదలందరికీ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తూ వారి జీవితాలలో వెలుగు నింపారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పూర్తిగా పేదలను వంచించిన చరిత్ర వారిదని అన్నారు. రాబోయే రోజులలో ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామ సెక్రటరీ సర్పంచ్ దేశం శ్రీనివాసరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. పాలవాయి అంజిరెడ్డి, దేశం వెంకటరెడ్డి, గొర్రెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే మద్యం అమ్మకాలు



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ కాలేషావలి

గురజాల: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మద్యం అమ్మకాలు నిర్వహించడం జరుగుతుందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ కాలేషావలి సూచించారు. మండల పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను, బార్‌అండ్ రెస్టారెంట్‌లను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలు ప్రకారమే మద్యం అమ్మకాలు జరుపుతున్నారని అన్ని దుకాణాల్లో బ్రాండెడ్ మద్యం అందుబాటులో ఉందన్నారు. అనంతరం మద్యం దుకాణాల సూపర్‌వైజర్‌లు, సేల్స్‌మెన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం అమ్మకాల్లో ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిపై చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాల్లో నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం కనుల పండువగా జరిగింది. వేదమంత్రాలతో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించాలి



దైవ సందేశమిస్తున్న పాస్టర్ ప్రవీణ్



మహాసభలకు హాజరైన విశ్వాసులు

మాచర్ల: ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించి ఆ ప్రభువు ఆశీస్సులు పొందాలని, పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్‌లు అన్నారు. సోమవారం పట్టణ శివారులో రాయవరం జంక్షన్‌లో జరిగిన సువార్త ఉజ్జీవ సభల్లో వారు ప్రత్యేక ప్రసంగీకులుగా పాల్గొని మాట్లాడారు. మొదటిరోజు సోమవారం జరిగిన ప్రార్థనలకు హాజరైన వేలాది మంది క్రైస్తవులనుద్దేశించి మాట్లాడారు. ఏసుక్రీస్తు బోధించిన వాటిని అనుసరించాల్సిన బాధ్యత ప్రతి క్రైస్తవుడికి ఉందన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రత్యేక కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు పాస్టర్స్ సంఘం నాయకులు, వేలాది మంది పాస్టర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



పిడుగురాళ్ల: గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించటం ఎంతో అభినందనీయమని డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు అన్నారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ వైనాట్ 175 క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ముందుగా బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లల్లో 151 పరుగులు చేయగా గుంటూరు ఆర్ సీసీ 19.1 ఓవర్లలో 155 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ని డాక్టర్ ఉన్నం నాగ మల్లిఖార్జునరావు చేతుల మీదుగా అందజేశారు. కౌన్సిలర్ ఉన్నం ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, టౌన్ యూత్ అధ్యక్షుడు మందా సుధీర్, రత్నబాబు, దయాకర్, ఆవుల పుల్లారావు తదితరులు ఉన్నారు.